# నేను అమాయకుడినా?

'మాగంటి'



'ఎంతసేపయింది రాజా, వచ్చి' మల్లెపూల సిగ సవరించుకుంటూ అంది మాధురి డ్రాయింగ్ రూంలోకి వస్తూ.

పదినిమిషాలయిందేమో అన్నాను నేను మాధురి వంక చూస్తూ. పదినిమిషాలయి వచ్చి డ్రాయింగ్ రూంలోనే కూర్చున్నావా? ఫక్కున నవ్వింది మాధురి. రాజా, నువ్వెప్పుడు మారతావో నాకు అర్థంకాదు. కనీసం రేడియో అన్నా పెట్టుకోలేదేం? అంటూ రేడియో ఆన్ చేసింది. నేను నవ్వాను.

'ఊ! ఏమిటి విశేషాలు? ఎప్పుడొచ్చావు ఊరి నుంచి? ప్రశ్నలవర్షం కురిపిస్తూ సోఫాలో కూలబడ్డది మాధురి.

'నిన్నసాయంకాలం వచ్చాను'

ఆమె మాట్లాడలేదు. సిలోన్‌నుంచి సన్నగా పాటలు వినబడుతున్నాయి.

లలిత సంగతేమైనా తెల్సిందా? ఉన్నట్టుండి మాధురి అడిగింది.

లలితమాట వినగానే నాకు కోపంవచ్చింది. కోపం లలితమీదకాదు. లలిత పేరెత్తిన మాధురి మీద.

తెలుసుకోవలసిన అవసరంలేదు. తెలుసుకోను అన్నాను కొంచెం కఠినంగా.

ఆమె నావంకచూసి నవ్వింది.

అసలు లలిత ... అంటూ ఏదో అనబోతున్న ఆమె మాటలకి అడ్డంవస్తూ 'ప్లీజ్ మాధురీ ఆమె గురించి మాట్లాడవద్దు' అన్నాను నేను.

ప్రకాశం ఏడీ? మాటమార్చాను.

'ఊళ్లోలేడు. ఈ మధ్యన కొంపులు తెగవస్తున్నాయి. చూడబోతే ప్రకాశమే కొంపాలని వేయించుకుంటున్నాడేమో. నలుగురోజుల్లో తిరిగి రావాలని. సరిగ్గా నువ్వెళ్ళిన మర్నాడే ప్రకాశం గూడా కొంపుకి వెళ్ళాడు; అన్నది.

అయితే పెళ్ళి పదిరోజులయిందన్నమాట అన్నాను సిగిరెట్ వెలిగిస్తూ.

చదరంగం పెట్టు. ఈ లోపల నేను కాఫీ తయారుచేసి పట్టుకొస్తా అని లోపలికి వెళ్ళిపోయింది మాధురి.

నేను బరువుగా తలవెనక్కి వాల్చి కళ్ళుమూసుకున్నాను. లలిత కళ్ళముందు ప్రత్యక్షమైంది.

'పాతకి!' కసిగా అనుకున్నాను.

చిన్నప్పుడు ఎక్కాలు ఒప్పచెప్పకపోతే తాను ఆమె చెవులు నులిమితే, కళ్ళలో నీళ్ళు నింపుకుని మొద్దులా కూర్చున్నలలితేనా ఈ నాడింత పనిచేసింది బాధగా తల అటు ఇటూ తిప్పసాగాను. మనసు వద్దంటున్నా వినకుండా గతంలోకి దూసుకు పోయింది

* * *

నేనూ, మాధురీ, లలితా, ప్రకాశం చిన్నప్పటి నుంచి స్నేహితులం. నలుగురం ఒకే వీధిలో ఉండే వాళ్ళం నలుగుర్లోనూ వసపిట్టలా వాగేది మాధురి తనేదో పెద్ద ఆరిందలా మాట్లాడేది, నాకంటె మాధురి నెలలు చిన్న. అయినా ఆమె నా కంటికి చాలా పెద్దదానిలా కనిపించేది. ఆమె నన్ను చిన్నపిల్లాడి క్రింద జమకట్టేది. ఎప్పుడూ ఏదో ఓ విషయంలో నన్ను గేలిచేసి ఏడిపిస్తుండే ప్రకాశం అదో మాదిరిగా ఉండేవాడు. ఒకక్షణంలో ఉన్నట్లు మరోక్షణంలో ఉండేవాడుకాదు. లలిత నాతోకంటే ప్రకాశంతో ఎక్కువే మాట్లాడేది. నలుగురిలోకి కాస్త ఉన్నవాణ్ణి నేనే. నలుగురం కలిసి నా గదిలో చదువుకొనే వాళ్ళం అలా మా స్నేహం స్కూలు ఫైనలుదాకాసాగింది, పరీక్షలు అందరంబాగారాశాం. అయితే ప్రకాశానికి మొదటినుంచీ చదువుమీద చాలా అశ్రద్ధ. అతని దృష్టి చిన్నప్పటినుంచీ వ్యాపారం మీద ఉండేది నాతో అప్పుడప్పుడు అంటూ ఉండేవాడు ప్రకాశం, 'రాజా, పెట్టుబడిలేని వ్యాపారం ఏదైనా ఉంటేచూడరా' అని.

పరీక్ష ఫలితాలు తెలిశాయి, నాకు ఫస్టుక్లాసూ, లలిత, మాధురికీ సెకండ్ క్లాసూవచ్చాయి. ప్రకాశం పరీక్ష పోయింది. ఆసమయానికి లలితా, మాధురీ మాయింట్లోనే ఉన్నారు. ముగ్గురం కలిసి ప్రకాశానికి ధైర్యం చెప్పటానికి బయలుదేరాం. వాళ్ళయింటి ముందర చాలామంది జనం గుమిగూడి ఉన్నారు.

మా గుండెలు దడదడలాడాయి. వణికే చేతులతో జనాన్ని తోసుకుంటూ లోపలికి వెళ్ళాం, ప్రకాశం తల్లి పెద్దగాఏడుస్తున్నది. ప్రకాశం తండ్రి చాలా కోపంతో అటూ ఇటూ తిరుగుతున్నాడు. ప్రకాశం తండ్రి బాంకులో గుమస్తా, ఆయనకి వచ్చేజీతం ఆ సంసారానికి బొటాబొటీగా సరిపోయేది.

ఇంతకీ విషయం ఏమంటే ప్రకాశం రాత్రి తండ్రితో బాంకులో అప్పు తీసుకోమనీ, ఏదైనా వ్యాపారం చేస్తాననీ అన్నాట్ట ప్రకాశం తండ్రి సుతారామూ ఒప్పుకోలేదు. తెల్లారి లేచేసరికి, బాంక్ డబ్బు పదువందల రూపాయలు ఇంట్లో ఉంటే తీసుకొని పరారీ అయ్యేడు. ఆ సమయంలో నేనే ఆయనకి మానాన్నద్వారా ఆ డబ్బు ఇప్పించాను. ఆయన నెలసరి వాయిదాలమీద తీరుస్తానని చెప్పారు.

అంతే. ప్రకాశం మరి కనిపించలేదు.

లలితా, మాధురీ, నేనూ కాలేజీలో చేరాం. ప్రకాశం లేకపోయినా మా స్నేహం అలాగేవుంది. అప్పుడప్పుడు ప్రకాశం గుర్తుకొచ్చి బాధ పడేవాళ్ళం. ఎక్కడ ఉన్నాడో ఎలాగు ఉన్నాడో అని.

ఏడాది గడిచి పోయింది. లలిత పి. యు. సి తో చదువు ఆపేసింది. మాధురి బి. ఏ. లోనూ, నేనూ బి యస్సిలోనూ చేరాం, మేమిద్దరం ఒకటే కాలేజీ అవటం మూలాన మేమిద్దరం మరింత సన్నిహితంగా అయ్యాం.

మాధురి కంటికి నేనో అమాయకుణ్ని. నేనో పసిపాపని, నా కేమీ తెలియదు. నాపై ఆమె భావన

పెద్దదయినా ఏ మాత్రం మారలేదు. అయితే ఏడాది అయ్యేసరికి మాధురి చదువు మానేసింది. దానికి కారణం వాళ్ళ అమ్మగారు హఠాత్తుగా పోయారు. ఇంత యింట్లో ఆడదిక్కు తనే. ఇది పెద్దకారణం కాకపోయినా ఆమెకి చదువుమీద శ్రద్ధ చాలా తగ్గిపోయింది.

నేను ఎలాగో గ్రాడ్యుయేటు నయ్యాను.

నిజానికి నాకు చదివి ఉద్యోగం చెయ్యాల్సినంత అవసరంలేదు. ఆస్తి చాలా ఉందిగా.

ఒక రోజు లలిత నాన్నగారు నా దగ్గరికివచ్చారు

'బాబూ, అంతస్తులు వేరయినా మీరందరూ కలిసి ఉంటున్నారు. 'చూడు బాబూ' అంటూ ఏదో పెద్ద రహస్యం చెప్పబోతున్నట్లు చెవి దగ్గరగా వచ్చి, 'లలిత నిన్ను పెళ్ళి చేసుకుంటుందిట' అన్నాడు. నేనొక్కసారి ఉలిక్కిపడ్డాను ఆ క్షణంలో నాకు ఆశ్చర్యం, ఆనందం కలిగాయి.

లలిత అందగత్తె, నెమ్మదైనది. నేను అప్పుడప్పుడు అనుకుంటూ ఉండేవాణ్ని. లలిత కాబోయే భర్త ఎవరోగాని అదృష్టవంతుడు అని కానీ ఆ అదృష్టం నన్నే వరిస్తుందని నేననుకోలేదు. నేను వెంటనే ఒప్పుకున్నాను.

ఆ సాయంత్రం నేను లలితని కలుసుకున్నాను. ఆ సమయంలో ఆమె నా కంటికి క్రొత్తగా కనిపించింది మొదటి సారిగా ఆమె నన్నుని చెంపలు తాకుతూ 'లలితా ' అన్నాను ఆప్యాయంగా.

ఆమె సిగ్గుతో తల వంచుకున్నది.

'లలితా, మన సంగతి మాధురికి అప్పుడే చెప్పవద్దు శుభలేఖ చూపెట్టి ఆశ్చర్యంలో ముంచెత్తుదాము. అన్నాను

ఆమె నవ్వుతూ తల ఊపింది.

మరో పదిరోజుల తరువాత శుభలేఖ తీసుకొని మాధురి దగ్గరికి వెళ్ళాను. మాట్లాడకుండా ఆమెకి శుభలేఖ నందించాను దాన్ని చూస్తున్న మాధురి వంక చూశాను, నేను అనుకున్నంత ఆశ్చర్యం ఆనందం ఆమె మొఖంలో కనబడ లేదు,

ఏం రాజా, పెళ్ళెప్పుడు చేసుకుంటావోయి, అయినా నిన్నెవరు చేసుకుంటారు ? అనేది.

'కో' అంటే కోటిమంది వస్తారు. నాకేం తక్కువ ? అనేవాణ్ని.

'పిచ్చివాడివి రాజా' అంటూ బుగ్గమీద మెల్లిగా కొట్టి వెళ్ళిపోయేది.

కానీ ఈరోజు ఎందుకంత ముభావంగా ఉన్నదో నాకర్థంకాలేదు.

"చాలా సంతోషం రాజా అన్నది శుభలేఖ టేబులుమీద పెడుతూ.

నాలో ఉత్సాహం చల్లారిపోయింది.

మాధురివంక చూశాను. ఆమె కళ్ళల్లో నీళ్ళు.

"మాధురీ ఏ కళ్ళల్లో, నీక క...ళ్ళ...ల్లో"

"ఇవి ఆనంద బాష్పాలు రాజా, ఆనంద బాష్పాలు" అంటూ గబ గబా వెళ్ళిపోయింది.

నేనలాగే రెండు నిముషాలుండిపోయాను.

* * *

నాకూ, లలితకీ వైభవంగా పెళ్ళి జరిగిపోయింది.

పెళ్ళి పెత్తనమంతా మాధురిమీదుగా జరిగింది.

పెళ్ళయిన నాలుగు రోజులకే హైదరాబాదులో ఇంటర్వ్యూవచ్చింది.ఆతరువాత అప్పాయింటు మెంటు ఆర్డర్సు వచ్చాయి. ఇదంతా లలిత మా యింటికి వచ్చిన వేళావిశేషమే అనుకున్నాను కాని మా యిద్దరికీ మాధుర్ని విడిచి వెళ్ళాలంటే బాధగా వుంది. మరి యిద్దరికి మాధురే ధైర్యం చెప్పింది

తరువాత వారానికోసారి మా యిద్దరికీ కలిపి ఓ కవర్లోనే ఉత్తరాలు రాసేది. నేనూ లలితా దాంపత్య నౌకలో చేరి మూడు నెలలు ఆనందంగా గడిపేశాం గత పదిహేను రోజులనుంచీ మాధురి దగ్గరనుంచి ఉత్తరాలు రావటంలేదు. నేనూ,లలితా చాలా కంగారుపడ్డాం. ఒకసారి మా ఊరు వెళ్దామా అని అనుకున్నాం. ఆసమయంలోనే మాధురి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. ఆత్రుతగా విప్పి చదివాను

డియర్ యంగ్ కపుల్,

చాలా ఆశ్చర్యం. ప్రకాశం కనిపించాడు. ప్రస్తుతం ఇక్కడే ఉన్నాడు. మీకు ఉత్తరంరాయడానికి సిగ్గుపడుతున్నాడు. అయినా ఉత్తరమేం ఖర్మ. మనిషినే పట్టుకొస్తున్నాను.

బై దిబై ఇంకో శుభవార్త నేను పెళ్ళిచేసుకున్నాను. మీకు తెలియకుండా పెళ్ళి చేసుకున్నందుకు నన్ను క్షమిస్తారుకదూ. నా మొగుడ్నికూడా తీసుకొస్తాను. గుడ్ బై.

మాధురి.

లలితా, దగ్గరగా ఆనందంగా పిలిచాను. చీరకొంగుతో చేతులు తుడుచుకొంటూవచ్చిన లలితభుజాలు పట్టుకొని ఊపిదేస్తూ, ప్రకాశం కనిపించాడు. మాధురి పెళ్ళిచేసుకుంది. ఆశ్చర్యకరమైన రెండు విశేషాలుచెప్పి ఆమెను ఆశ్చర్యంలో ముంచేశాను 'వాళ్ళిద్దరూ మాధురి మొగుడూ ఇక్కడికి వస్తారు అన్నాను ఉత్తరాన్ని ఆమెచేతికిస్తూ.

రెండురోజులు గడిచాక ఒకరోజు ఉదయానే దిగారు ప్రకాశం, మాధురి. నేనూ, ప్రకాశం ఆప్యాయంగా కౌగలించుకున్నాం ప్రకాశం ఎక్కువ మారలేదు ప్రకాశం ఆరోజు బయలుదేరలూ తీసుకొని బొంబాయి వచ్చాట్ట. ఓమెడికల్ కంపెనీలో సేల్సుమాన్ క్రింద చేరాట్ట. ఎలాగో తంటాలుపడి ఇప్పుడు ఆదేకంపెనీలో సేల్సు ప్రమోషన్ ఆఫీసరుగా ఇక్కడికి వచ్చాట్ట నెలకి ఇరవయిరోజులు కాంపులోనే ఉంటాడుట. అంతో ఇంతో వెనకేసి కంపెనీలో భాగస్వామ్యం తీసుకున్నాట్ట ఈవిధంగా అయినా ప్రకాశం జీవితలక్ష్యం నెరవేరుతున్నందుకు సంతోషించాం

'నీ మొగుడేడీ' నవ్వుతూ మాధురిని అడిగాను. ఆమె రాసిన ఉత్తరం గుర్తుతెచ్చుకుంటూ.

'ఇంకెవరూ ఆయనే' అన్నది ప్రకాశాన్ని వేలెట్టి చూపుతూ.

నేనూ, లలితా ఆశ్చర్యంతో అలాగే నిలబడిపోయాం.

ఎన్నాళ్ళకో కలుసుకున్న మేము నాలుగు రోజులపాటు హైదరాబాదులో చూడవలసినవన్నీ చూసి, హాయిగా కబుర్లతో, సినిమాలతో, షికార్లతో కాలం గడిపేశాం.

'నేను ఎలాగో నెలకి ఇరవైరోజులపాటు ఊళ్ళోఉండనుకాబట్టి మాధురిని ఇక్కడే ఉంచేద్దాం మనుకుంటున్నాను. నాకు ఎక్కడయినా పర్వాలేదు ఊళ్ళు తిరిగేవాణ్ని కాబట్టి. మీ యింటి దగ్గర్లోనే యిల్లుచూడరా రాజూ' అన్నాడు ఓరోజు ప్రకాశం నాతో

'అదీ నిజమే. ఇక్కడఉంటే మాధురికి కాలక్షేపం అవుతుంది.' అన్నాను, తరువాత పదిహేను రోజులకే మాధురీ, ప్రకాశం హైదరాబాదు వచ్చేశారు. అదేం చిత్రమోకానీ ఇక్కడకొచ్చిన తరువాత ప్రకాశం కాంపులు తగ్గించుకున్నాడు నేను ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి లలితా, ప్రకాశం చదరంగమో, కారమ్సుఅయినా, పేకాటఅయినా ఆడుకుంటూ కనిపించేవారు. మూడునెలలు గడిచాయి. ప్రకాశం ఉన్నట్టుండి మళ్ళీ కాంపులు వేయించుకున్నాడు. నాతోసరిగ్గా మాట్లాడటం మానేశాడు. మరి కొద్దిరోజులకే లలిత ఉన్నట్లుండి ఎక్కడికో వెళ్ళిపోయింది. వెళ్ళేటప్పుడు ఉత్తరం ఏమిరాయలేదు. నాకుతెలుసు. లలిత ఎక్కడికి వెళ్ళిందో. కాని ఇంక ఆమెని తీసుకురాను. జీవితంలో ఆమెముఖం చూడను. చాలా గట్టిగా నిర్ణయించుకున్నాను.

* * *

'రాజా, ఆదేమిటి, చదరంగం పెట్టమన్నానుగా అంత పరధ్యానంగా ఏమిటో ఆలోచిస్తున్నావు.' ఉలిక్కిపడ్డాను నేను

'మాధురీ మనస్సు బాగాలేదు. సినిమాకెళ్దాం' అన్నాను ఆలోచనలనుండి తేరుకుంటూ.

అపునవును సినిమాకి వెళ్దాం. జెర్రీ...

'మాధురీ జెర్రీ లూయిస్ పిక్చర్ కి వద్దు. తెలుగు సినిమాకి వెళదాం' అన్నాను ఆమెవంక అసహనంగా చూస్తూ.

ఆమె విచిత్రంగా నా వంక చూసింది.

'నీ యిష్టం' అన్నది, తన యిష్టాన్ని ఖాతరు చేయలేదన్న కోపం లేకుండా, మాధురికి జెర్రీ లూయిస్ అంటే చాలా యిష్టం.

ఇద్దరం కలిసి బయలుదేరాం. దారిలో పువ్వులు కొన్నది మాధురి. ఆమె బాగ్ తెరచి పైసలు తీసేలోగా నేను జేబులోంచి డబ్బులు తీసి పూలవాడికి యిచ్చేశాను. ఆమె నా వంక చూసి నవ్వింది.

సినిమా హాలునుంచి వచ్చేటప్పుడు ఇద్దరం ఒకటే రిక్షాలో వచ్చాం.

రిక్షాలో ఆమె పక్కన కూర్చుంటే ఎన్నడూ మాధురిమీద కలగని ఊహలు నా మనస్సుకి కలుగుతున్నాయి

'మాధురీ' మెల్లిగా పిలిచాను.

ఊఁ, ఏమిటి అన్నది నా వంకచూసి నవ్వుతూ, రిక్షా ఇంటికి వచ్చింది, నా పాంటు జేబులోంచి డబ్బులు తీసి యిచ్చేలోగా మాధురే బాగ్ తెరచి డబ్బులిచ్చేసి పకపకా నవ్వింది. డైనింగు టేబులు మీద భోజనం పెట్టి నన్ను పిల్చింది మాధురి. నేనింకా బూట్లు విప్పలేదు. మాధురి డ్రాయింగ్ రూంలోకివచ్చింది. లైట్ లేదు. ఆమె నాకాళ్ళదగ్గరికి వచ్చింది. బూట్లు విప్పసాగింది. నా కంతా అయోమయంగా ఉంది, ఆమె నా కంటికి మాధురిలా కన్పించడం లేదు. లలితలాగా.

'లలితా !' మరుక్షణం బూట్లు విప్పుతున్న ఆమె

చేతులను పట్టుకొని మీదికి లాక్కున్నాను.

రాజా, నేను లలితను కాను. మాధురిని, మాధురిని రాజా అన్నది ఆమె నన్ను విడిపించుకుంటూ.

నువ్వు ఎవరివైనా సరే, నువ్వు నాకు కావాలి మరింత దగ్గరకి లాక్కున్నాను.

మరుక్షణం నా చెంప చెళ్ళుమంది.

ఆమె దూరంగా తొలిగిపోయింది ఆమె ముఖం నాకు సరిగ్గా కనిపించటం లేదు

కొద్దిక్షణాలు ఎవ్వరూ మాట్లాడలేదు.

'ఇదే మాట, రెండు ఏళ్ళ క్రితం అంటే సంతోషంగా అంగీకరించేదాన్ని. కానీ ఇప్పుడు నేను పరాయిదాన్ని. నువ్వు పరాయి వాడివి, ఈ మాధురి ఎప్పుడూ మానసికంగా నీదేరాజా" ఆమె భోరున ఏడవ సాగింది.

నాకు ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్లని పించింది

ఆమె మాటలు నాచెవుల్లో హోరులెత్తుతున్నాయి.

నేను తూలుకుంటూ, బయటకి వచ్చేశాను.

* * *

నాలుగు రోజులు గడిచాయి. మాధురి యింటికి వెళ్ళటానికి నాకు మనస్కరించలేదు. ఆ రోజు ఆఫీసునుంచి రాగానే పోస్టుమాను పడేసిన ఓ కవరు ఒకటి ముందరి గదిలో పడుంది.

కవరు చింపి ఆత్రుతగా చదవసాగాను.

డియర్ రాజా

నువ్వు వస్తావని మూడు రోజుల నుంచీ ఎదురు చూసి ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. నువ్వు శుద్ధ అమాయకుడివి రాజా. పెళ్ళికాక ముందు నన్ను అర్థం చేసుకోలేక పోయావు. పెళ్ళి అయిన తరువాత లలితని అర్థంచేసుకోలేక పోయావు. రాజా ఈ ఉత్తరంతో పాటు ప్రకాశం, లలిత నాకు రాసిన ఉత్తరాలు జత పరుస్తున్నాను. ఆ రెండు ఉత్తరాలూ చదివితే పరిస్థితి అంతానీకు అర్థమవుతుంది దూరంగా ఉంటేనే ఆప్యాయతలు విలుస్తాయి. మేము ఈ ఊరు వదలి వెళ్ళి పోతున్నాము. నువ్వు లలితని గురించి ఏం నిర్ణయించుకున్నావో మాకు వ్రాయి కానీ లలితకి మటుకు తిరిగి అటువంటి పరిస్థితి రానీయ వద్దని కోరుతూ, మీరిద్దరూ కళ కళ లాడుతూ కలకాలం జీవించాలని ఆశిస్తూ,

మాధురి

ఆతృతగా మిగిలిన రెండు ఉత్తరాలు చదవ సాగాను.

డియర్ మాధురి,

నాకీ పరిస్థితి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. రాజా ఇంత అనుమాన పిశాచి అని నేను ఎన్నడూ అనుకోలేదు. మీరు ఈ ఊరు వచ్చిన తరువాత ప్రకాశం కాంపునకి వెళ్ళక పోవడం తరచు మా యింటికి వచ్చి నాతో చనువుగా ఉండటం అతనిలో ఈర్ష్యా, అనుమానమూ కలిగించాయి. రోజూ ఆఫీసునుంచి రాగానే ప్రకాశం వచ్చాడా వస్తే ఎప్పుడు, ఎందుకు ఎంతసేపు ఉన్నాడు. ఈ ప్రశ్నలతో నన్ను వేధించే వారు. వారిలో అనుమానమూ నానాటికి పెద్దదయి నన్నూ ప్రకాశాన్నీ నానా మాటలూ అనేవారు. ప్రకాశం ఎదురుగా ఉంటే ఏమి మాట్లాడేవారు కాదు. అందుకే ఈ బాధలన్నీ భరించలేక ఆత్మహత్య చేసుకుందామని బయలుదేరిన నాకు అనాధాశ్రమ అధికారిణితో పరిచయమూ వారి ఆశ్రయంలో చల్లని నీడ దొరికాయి. ఇంక ఇక్కడ అంతా బాగానే ఉంది, కానీ నాకు వారిమీద బెంగగా ఉంది. ఎలా ఉన్నారో ఏమో అని. దయచేసి నువ్వు కొంచెం వారిని కనిపెట్టుతూ ఉండు

లలిత.

మూడో ఉత్తరం

డార్లింగ్ మాధురి,

ఈ మధ్యన నాలో మార్పుని నువ్వు కనిపెట్టి ఉంటావు నాకెందుకో ఈఊళ్ళో ఉండబుద్ది కావటంలేదు కారణం ఏమిటో నీకు తెలిసి ఉంటుంది. రాజా లలితనీ నన్ను అనుమానిస్తున్నాడన్న

(మిగతా 36 వ పేజీలో)

# సమాజం నిద్రిస్తోంది!

— గంధం జోయెల్

సమాజం నిద్రిస్తోంది!
శుష్కవేదాంతం రగ్గు కప్పుకొని,
మత్తుగా, చిత్తుగా నిర్లక్ష్యంగా
గుర్రు పెడుతూ రాత్రీ పగలనక
నిర్భయంగా నిద్రిస్తోంది!
వంచలకు వంతిన పాడి,
మంచిని సమాధి చేసి,
లంచాల మంచంమీద
సమాజం నిద్రిస్తోంది
గంజి నీళ్ళు లభ్యం కాని
గరీబుల దారిద్ర్యానికి,
సంజాయిషీ చెప్పలేక
స్వార్థం నైరితలలు వేస్తోంటే
న్యాయాన్ని నరకానికి పంపి,
నీతి అడుగంటి పోతోంటే
మానవత్వం మంట కలుస్తోంటే
అవినీతి త్రాచు పడగ విప్పి,
నాట్యం చేస్తోంటే
మూఢత్వంతో పాడు సమాజం
గాఢ నిద్ర పోతోంది!
చీకటి బజార్లో దగాకోర్లు
స్వలాభాల్తో వెలుగుతోంటే,
తరతరాల మన(మంచి)సంస్కృతి
తరిగి, ముక్కలౌతూ వుంటే
'మారాలి మారాలి,
ఈ కుళ్ళు వ్యవస్థ' అని
అందరూ కేకలేస్తూ నడి వీధిలో
ఊరేగింపుగా వెడుతూ వుంటే
అల్లరి చేస్తూ; అరచినా
లెక్కచేయదేం, తిక్కనా?
ఈ సమాజం గ్రుడ్డిదే
అనుకున్నాను
చెముడు కూడనా?
ధనవంతుల నైటుక్లబ్బుల్లో
రాత్రంతా తప్పతాగి, గొప్పగా
వాళ్ళ సంగీతానికి నృత్యం చేసి,
తెల్లవారుజామున యింటికి
మరలి వచ్చిన, మారనన్న
నిద్రించిన ఈ సమాజం
ఎప్పుడు మేల్కొంటుందో
వేచిచూడాల్సినపని కాదు!
నవ తాళికులారా
నవయువతీ యువకులారా!
నవసమాజ నిర్మాణ
యుగంధరులారా!
భోగులకు బుద్ధి చెప్పాలనుకునే
మహాయోగులారా,
త్యాగశీలులారా!
అరుణోదయవాదులారా!
ఆపండి అక్రమ, కుతంత్ర
కృత్యాల్ని —
లేపండి! బూజుపట్టిన
సమాజాన్ని!!

★

# నెగ్‌లెక్‌టెడ్ చైల్డ్

[24 వ పేజీ తరువాయి]

మయ్యాయి.

అనేకమంది స్త్రీల జీవితాలు నాశనం చేశాము

అందంగా వున్న ఆడపిల్ల కనిపిస్తే చాలు ఏదో విధంగా వేటాడి వాళ్ళ జీవితాలు నాశనం చేశాము.

ఇలా పది సంవత్సరాలు దేశంలో తిరిగాము. అందరి హృదయాల్లో గజదొంగ ధర్మారావు అలా రం అయ్యాడు. బోలెడంత ధనాన్ని సంపాదించాం సుఖంగా అనుభవించాం.

గవర్నమెంటు వారు స్పెషల్ పోలీసు శాఖను మమ్మల్ని పట్టుకొనుటకు నియమించింది.

మా ముఠా టూవులుగా చీలిపోయి దేశంలో తలో మూలకు బయలుదేరాము.

నా ముఠాతో నేను తిరుగుతూ తిరుగుతూ మా వూరు చేరుకున్నాను. ఊరి బయట రహస్యంగా ఉండేచోటున మకాం పెట్టాం. పగలల్లా మారు వేషాలతో ఊళ్ళోతిరిగి సాయంకాలానికి మా బసకు చేరుకునే వాళ్ళం.

రాత్రిపూట మా కార్యక్రమం సాగించేవాళ్ళం. అన్నయ్య లాయరుగా మంచి పేరు సంపాయించా డని విన్నాను.

నా ఆస్తి విషయంలో అన్యాయం జరిగిందనే బాధ నాలో పీడిస్తోంది. అన్నయ్యపై ద్వేషం పెరిగింది.

అక్కడే దొంగతనము చేయాలను కున్నాను. ఒకరోజు

అర్ధరాత్రి పన్నెండు గంటలకు మా ముఠాను బస దగ్గర వుండమని చెప్పి నేను బయలు దేరాను. ఒక అరగంటలో ఇంటిని చేరుకున్నాను చాలా మార్పు వచ్చింది.

దొడ్డివైపున వున్న గోడమీకి లోపల ప్రవేశించాను. వేసవికాలం. తలుపు తీసివుంది, మధ్య హాలులో ఎవరో పడుకొని వున్నారు. హాలులో బెడ్ లైటు వెలుగుతుంది.

మధ్య హాలులో పడుకున్నది అమ్మ.

బాగా కృశించి పోయింది.

అలా చూస్తూ కాసేపు నిలుచున్నాను.

ఇంతలో ఒంటిగంట కొట్టింది.

ప్రక్కగదిలో ఫ్యాన్ వేసివుంది. లైటు వెలుగు తోంది. నెమ్మదిగా గదిలోకి వెళ్ళాను. అన్నయ్య లేడు. వదిన పడుకొని వున్నది.

నెమ్మదిగా లైటు ఆర్పాను. నా బ్యాటరీ సహాయంతో పెట్టె తెరిచాను. కొంతడబ్బు, బంగారం దొరికింది. అవి తీసుకుని బయలు దేరాను. నా బ్యాటరీ వెలుగు మంచంపై నున్న వదినమీద పడింది. ఆమె కంఠంలో తళుక్కున మెరిసింది. దగ్గరకు వెళ్ళి చూచాను.

చంద్రహారం!

నెమ్మదిగా చేయిపెట్టి తీయబోతున్నాను. ఇంతలో ఆమె లేచి "ఎవరు! ఎవరు" అని అరచింది.

అరిస్తే చంపుతానని భయపెట్టా. హారం పట్టుకు లాగుతున్నా ఆమె "దొంగ, దొంగ" అని అరచింది.

"ఆ, దొంగా! ఎక్కడ, ఎక్కడ" అంటూ అమ్మ వచ్చింది. గుమ్మం దగ్గరకు.

గబ గబా ఆమెను పడద్రోసి బయటకు పరిగెత్తాను. పోలీసులు ఆచూకీ మొదలుపెట్టారు, నేను మా అమ్మను పడద్రోసిన ఫలితంగా ఆమెకు బలమైన దెబ్బలు తగిలినవి. హాస్పిటల్‌లో చేర్పించారని విన్నాను. ఆమె కొన్నాళ్ళు తీసుకొని చనిపోయింది.

ఈ వార్త విని ఎంతో కుమిలిపోయాను.

ఆటు తండ్రిగారికి మానసికంగా బాధ కలిగించి ఆయన మరణానికే కారకుడనయ్యాను.

నాలో ఏదో మార్పు వచ్చింది అప్పటినుండీ. ముఠావాళ్ళు ఎంత గొడవచేసినా దొంగతనానికి బయలుదేరేవాడినే కాదు. చివరిసారిగా తల్లి భౌతిక దేహాన్ని చూడాలనిపించింది. నాలో తెగింపులేదు. నా ముఠా కదలనీయలేదు.

ఆమె చావుకు కారకుడనై కడసారిగానైనా చూడలేకపోయాను. శ్మశానం చాటునుండే ఆమె చితిని చూచాను. ఆ రోజునుండే నాలో వింత మార్పు వచ్చింది.

త్రాగుడు త్రాగబుద్ధికాలేదు.

దొంగతనాలు చేయబుద్ధికాలేదు. ముఠావాళ్ళు నా మార్పుకు ఆశ్చర్యపడ్డారు. ఇక లాభంలేదనుకొని నేను నిద్రలోనున్న సమయంలో నన్ను వదిలి వెళ్ళిపోయారు. అలాగే కొన్నాళ్ళు ఆ గుట్టలూ, మెట్టలూ తిరుగుతూ గడిపాను.

ఒక రోజు.

మిట్ట మధ్యాహ్నం బాగా ఆకలివేసింది. ఎండ తీవ్రంగావుంది. ఆ చుట్టు ప్రక్కల మంచినీళ్ళు కూడ లేవు. బాగా దాహంవేసింది దగ్గరలోనున్న పల్లెలోకి వెడదామనుకొన్నా కానీ నడిచే శక్తిలేదు. దప్పికతో పడియాను. స్పృహవచ్చినతర్వాత చూస్తే హాస్పిటల్‌లో వున్నాను. చుట్టూపోలీసులు వున్నారు. నేను పూర్తిగా మారినానని చెప్పినా ఈ సమాజం విశ్వసించదు. నా అన్నగారు నాలో మార్పువచ్చిందని గ్రహించారు. జైలులో వుండగానే అక్కడకు వచ్చి నా ఆస్తి అంతా భద్రంగా వుందనీ, నాన్నగారు చెప్పినప్రకారం చేశాననీ చెప్పారు.

ఆయనకు నాముఖం చూపలేకపోయాను. నాపై ప్రేమకొద్దీ నాతరపున వకాల్తా పుచ్చుకున్నారు. ఈ కృతఘ్నుడికి శిక్షలేకుండా ప్రయత్నించటమా!

వద్దు!

ఒక బందిపోటుదొంగని, ఖూనీకోరును, త్రాగుబోతుని, తల్లితండ్రులను పొట్టనపెట్టుకున్న పాతకుణ్ణి, సమాజం వదిలిపెట్టకూడదు. తగినశిక్ష విధించాలి. నా పాపాలకు ప్రాయశ్చిత్తంలేదు."

ఒక్కసారి ఆగిపోయాడు ధర్మారావు.

అంతా విస్మయంగా అతనివైపు చూస్తున్నారు. మరల అతను

యువరానర్!

ఒక్క విషయం.

నేను యీ సమాజంలో ఘాతకుడుగా, ద్రోహిగా కావడం! నా అన్నగారంటే తేలికభావం ఏర్పడటానికి కారణం? నేను యిటువంటి మానవాధముణ్ణి అవటానికి కారణం? నా నైతికపతనానికి కారణం!

ఏమిటి.

అంటె

నా దృష్టిలో నాతల్లి, తండ్రులు సరైనశిక్షణ యివ్వకపోవటమే కారణం. పిల్లలపై మమకారా ఉండవచ్చు. ఒకబిడ్డపై కన్న ఇంకొకబిడ్డపై ప్రేమ ఎక్కువ ఉండవచ్చు.

కానీ!

ఇది వ్యత్యాస రూపంగా వ్యక్తపరిస్తే ఎలా వుంటుందో నా జీవితమే ఒక ఉదాహరణ

అంటే అందరి జీవితాలు అలా వుంటాయని కాదు.

ఇలా వుండకుండా వుండాలని కోరుచున్నాను.

నా జీవితంలాగా ఎవ్వరి జీవితాలు చేయవద్దని నా ప్రార్థన పిల్లల పెంపకం విషయంలో తల్లి, తండ్రులు తమ బాధ్యతలు సరిగా నిర్వహిస్తే వారు భవిష్యత్తులో సత్ప్రవర్తకు లవుతారు

అలాకాక,

నాలా అలక్ష్యితుడుగా వుండే సంఘ ద్రోహి అవుతాడు. (A Neglected Child will become a dangerous citizen.)

నా తల్లిదండ్రులు నన్ను సరైన శిక్షణతో పెంచితే నా జీవితం యింకొక రకంగా వుండేదేమో!

యువరానర్!

నాకు యీ అవకాశాన్ని యిప్పించినందులకు కృతజ్ఞుడను అని తల వంచుకున్నాడు.

★

# నేను అమాయకుడినా?

[35 వ పేజీ తరువాయి]

విషయం లలిత ఉత్తరం రానేదాకా నాకుతెలియదు. విజానిజాలు నీకుతెలుసు. రాజుకి నచ్చజెప్పు అతడి అనుమానాన్ని తొలగించి వారిద్దరినీ కలుపు. మనం ఇంక అక్కడ ఉండవద్దు. నాలుగైదు రోజుల్లో అక్కడ్నించి వెళ్ళిపోదాం రాజుని అడిగానని చెప్పు.

ప్రకాశం.

మూడుఉత్తరాలూ టేబులుమీద పడేశాను. నాలో ఏమన్నా పొరపాటుఉందేమో, నాలోనేను తర్కించుకున్నాను. లలిత ఆత్మహత్య చేసుకొనే అంత పరిస్థితి ఎందుకుఏర్పడ్డది? నిజమే. నేను లలితని అనుమానించాను, ఇది బయటికితెలిస్తే ముఖ్యంగా మాధురికీ, ప్రకాశానికీ తెలిస్తే, ఎంత అభాసుఅయ్యేది అందుకే లలిత ఆత్మహత్య చేసుకుందామనుకొన్నది. లలిత, ప్రకాశం చిన్నప్పటినుంచీ చనువుగా ఉండేవారు. అయినా మానలుగురిమధ్య ఈ అనుబంధం ఏనాటిది. ఈ నాటివరకు అది చెడిపోకుండా ఉన్నది. నిజంగా నేను ఫూల్‌ని, మాధురి ప్రేమని అర్థంచేసుకోలేక పోయాను, లలిత మనసు అర్థంచేసుకోలేకపోయాను. వెంటనే లెటర్‌పాడ్‌తీసి లలితకి ఉత్తరం వ్రాయటానికి ఉపక్రమించాను.

ఇంతకీ నేను అమాయకుడినా!

★